నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 28 ఆగస్టు 2024 | HYDERABAD

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టర్

ఆర్టీసీ కార్మికుల నిరసన

నగరంలోని ఆర్టీసీ డిపోల్లో కార్మికులు విధులు నిర్వహిస్తూ తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గౌలిగూడలోని హైదరాబాద్ డిపో-1లో ఆందోళన చేశారు. పని భారం, ప్రభుత్వంలో విలీనం, బాండ్ డబ్బులు, పీఆర్సీ, మహాలక్ష్మి టిక్కెట్ల వల్ల కండక్టర్లు పడుతున్న సమస్యల పై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. - సుల్తాన్‌బజార్, ఆగస్టు 27

తల మీదే.. రక్షణ మీదే!

ఒక తలపోతే రెండో తల పొందలేరు నాలాగ

ఆర్టీఏ కార్యాలయాల్లో వాహనదారులకు వినాయకుడి సందేశం

ఆకట్టుకుంటున్న గణేశుడి పోస్టర్

సిటీబ్యూరో, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ) : హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపి ప్రమాదానికి గురి కాకూడదని వాహనదారులకు అవగాహన కల్పించేందుకు ఆర్టీఏ అధికారులు వినూత్న పద్ధతిలో ప్రచారం చేస్తున్నారు. రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓ పోస్టర్ ఎంతగానో ఆలోచన రేకెత్తిస్తోంది. రానున్న వినాయక చవితిని దృష్టిలో పెట్టుకొని వాహనదారులకు ఆ గణేశుడిని గుర్తు చేస్తూ.. ఆర్టీఏ అధికారులు పోస్టర్ ఏర్పాటు చేశారు. అందులో 'తల మీదే రక్షణ మీదే' ఒక తలపోతే రెండో తల పొందలేరు నాలాగ' అంటూ ఆ లంబోదరుడే హెచ్చరిస్తున్నట్టు పోస్టర్‌లో రూపొందించారు.

దీంతో వాహన సేవలకోసం వచ్చిన వారంతా ఆ పోస్టర్‌ను చూసి హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతను తెలుసుకుంటున్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అధికారులు సైతం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్న విషయం తెలిసిందే.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరైన సందర్భంగా ఆర్టీసీ ఎక్స్ రోడ్డులో పటాకులు పేలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

ఎమ్మెల్సీ కవిత ఇంటి ఎదుట హర్షం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

సిటీబ్యూరో, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ), చిక్కడపల్లి : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీం కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేయడంతో నగర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబురాలు చేసుకున్నారు. కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ వీడియోలను సోషల్ మీడియలో షేర్ చేస్తూ సందడి చేశారు. 'అంతిమంగా న్యాయమే గెలిచింది' అంటూ పోస్టులు చేశారు. మరికొందరూ పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఏ ఆధారాలు లేకుండా సుమారు 150 రోజులకు పైగా జైలులో పెట్టారని ఇది అన్యాయమని కొందరు నెటిజన్లు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సత్యమే గెలిచిందంటూ మరికొందరు ట్వీట్స్ చేశారు. ''డాటర్ ఆఫ్ ఫైటర్' అంటూ కవితక్కను కొనియాడారు. 'వెల్‌కం అక్క' అంటూ ఇంకొందరూ తమ అభిమానాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. అలాగే ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పటాకులు పేల్చి, బ్యాండ్ బాజాతో డ్యాన్స్ చేస్తూ సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్, ముషీరాబాద్, అడిక్‌మెట్ బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షులు రాకేశ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడండి.. పనులు చేయండి

'ఎస్ఆర్‌డీపీ' పై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్

సిటీబ్యూరో, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఆర్‌డీపీ పనులపై నిర్లక్ష్యం వహిస్తోందని, గడిచిన 8 నెలలుగా సరైన పర్యవేక్షణ లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని, వెంటనే ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు సంబంధించిన పనులపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్ఆర్‌డీపీ మూడో దశను ప్రారంభించాలని, దీనికి సంబంధించిన ప్రణాళికలకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఆమోదం కూడా లభించిందని పేర్కొన్నారు. మూసీకి ఇరువైపులా ఎక్స్‌ప్రెస్ వే, కేబీఆర్ పార్కు కింద టన్నెల్స్, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు వంటి పనులు ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఎస్ఆర్‌డీపీ (స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) పేరుతో మంచి కార్యక్రమాన్ని తీసుకుందని కేటీఆర్ వివరించారు. ఎస్ఆర్‌డీపీలో 42 కొత్త ప్రాజెక్టులను పూర్తి చేయాలని సంకల్పించి, 36 ప్రాజెక్టులను పూర్తి చేసిందని తెలిపారు. మిగిలిన ప్రాజెక్టులను ఈ ఏడాది చివరి కల్లా పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. నగరంలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపర్చడంతో పాటు అభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టు విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని ప్రభుత్వానికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

KTR @KTRBRS

SRDP (Strategic Road Development Program) was a Flagship initiative for developing Hyderabad infrastructure under which KCR Govt had initiated 42 new projects & also completed 36 successfully

The remaining projects were also to be completed in 2024

After the Congress Govt took charge, all ongoing SRDP works have slowed down & are moving at snails' pace. In the last 8 months there is no proper monitoring or timely payments

Urge the Govt to continue to work on improving infrastructure & initiate phase-3 of SRDP for which all plans were submitted & approved by previous Govt

This list includes Expressway alongside Musi, Tunnels under KBR park, Flyovers, Underpasses and many other grade separators

#Hyderabad #SRDP

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన

పాల్గొన్న సిటీ కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(హెచ్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పాష్)పై రెడ్ హిల్స్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీలో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, మహిళా భద్రత డైరెక్టర్ శిఖా గోయెల్, ప్రభుత్వ కార్యదర్శి, మహిళా, శిశు అభివృద్ధి శాఖ కమిషనర్ వాకాటి కరుణ, హెచ్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ శేఖర్‌రెడ్డి, మహిళా భద్రత డీసీపీ దార కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాపునకు హాజరైన ప్రముఖులు మాట్లాడుతూ.. హెచ్‌సీఎస్‌సీ కార్యాలయాలు, సంస్థలు, కమ్యూనిటీల్లో లైంగిక వేధింపులకు సంబంధించిన అంశాలపై వరుసగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేధింపుల నిరోధక చట్టం 2013 గూర్చి వివిధ సంస్థల అంతర్గత కమిటీ సభ్యులకు అవగాహన కల్పించడం ద్వారా చట్టంపై అవగాహన పెరగడం, దానిని సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. అన్ని సంస్థలలో అంతర్గత కమిటీల ఏర్పాటు తప్పనిసరి చేయడం వల్ల ఉద్యోగులకు, ప్రధానంగా మహిళలకు సురక్షితమైన వాతావరణం ఏర్పడుతుందని సూచించారు.

గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి!

32 ఎకరాల్లో నిర్మాణానికి రెడీ

అభివృద్ధి పనులపై అధికారులతో సీఎం సమీక్ష

వచ్చే యాభై ఏళ్లను దృష్టిలో పెట్టుకుని ఆసుపత్రి నిర్మాణం

భూ బదలాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు

గోషా మహల్ సిటీ పోలీస్ అకాడమీకి త్వరలో ప్రత్యామ్నాయ స్థలం

కార్పొరేట్ తరహాలో వైద్యం అందేలా సదుపాయాలు కల్పించాలని సూచనలు

గోషామహల్ స్థలాన్ని పరిశీలించాలని కలెక్టర్‌కు ఆదేశం

సిటీబ్యూరో, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ) : ఉస్మానియా ఆసుపత్రి గోషామహల్‌లో ఏర్పాటు చేసేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా ఎంచుకున్న స్పీడ్ ప్రణాళికలలో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం ఒక్కటి. సచివాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వివిధ అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం, స్థలం కేటాయింపు తదితర అంశాలపై అధికారులకు కీలక సూచనలు చేశారు. గోషా మహల్‌లోని పోలీస్ స్టేడియం, పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు సుమారు 32 ఎకరాల స్థలం ఉంది. ప్రస్తుతం పోలీస్ విభాగంలో ఉన్న ఈ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ స్థలంలో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం జరగనుంది. రాబోయే 50 ఏండ్లలో అవసరాలను అంచనా వేసుకుని కొత్త ఆసుపత్రి నిర్మాణం డిజైన్ ఉండనుంది. అంతేకాదు వివిధ ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే వారికి ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. అంతేకాదు ఆసుపత్రికి అవసరమైన అన్ని విభాగాలతో పాటు అకడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు హాస్టళ్లు కూడా నిర్మించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. కార్పొరేట్ తరహాలో వైద్యం అందేలా సదుపాయాలు కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. కాంక్రీట్ భవంతులు, బహుళ అంతస్తులు కాకుండా ఆహ్లాదకరమైన విశాలమైన ఖాళీ ప్రాంగణం ఉండేలా ప్రణాళికలు చేయాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి నిపుణులైన ఆర్కిటెక్ట్స్‌తో డిజైన్‌లు రూపొందించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ఇప్పుడున్న ఉస్మానియా ఆసుపత్రిని చారిత్రక కట్టడాలుగా పరిరక్షించనున్నారు. కాగా గోషా మహల్ స్థలాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించనున్నారు.

గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

మట్టి విగ్రహాలపై అవగాహన కల్పించాలి

రోడ్ల మరమ్మతులు పూర్తి చేయండి

నిమజ్జనానికి టస్కర్ వాహనాలు, క్రేన్లు సిద్ధం చేయండి

సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

సిటీబ్యూరో, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ) : నగరంలో గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు అన్నారు. గణేశ్ ఉత్సవాలపై ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లపై హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో మంగళవారం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ అనిల్‌కుమార్, మేయర్ విజయలక్ష్మి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 11 రోజుల పాటు జరుగనున్న ఉత్సవాల్లో శాంతి భద్రతల సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. పోలీస్, విద్యుత్, రవాణా, ఆర్టీసీ , మెట్రో, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పనులను అధికారులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గత సంవత్సరం కంటే 10 శాతం విగ్రహాలు పెరిగే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలో 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ దగ్గర వరదనీరు నిలువకుండా త్వరగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే నిమజ్జనానికి బేబీ పాండ్స్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు.

మట్టి విగ్రహాలను పూజించాలి : మంత్రులు

మట్టి విగ్రహాలను పూజించేలా ప్రచారం నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి. శ్రీధర్‌బాబు అధికారులకు సూచించారు. 7 జోన్ల పరిధిలో జోనల్ కమిషనర్, డీసీపీలతో మండపాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సూచించిన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వచ్చే నెల 7 నుంచి 17 మధ్య జరిగే గణేశ్ ఉత్సవాల సందర్భంగా లా అండ్ ఆర్డర్ విషయంలో మంత్రులు అధికారులకు పలు సూచనలు చేశారు. పండుగ లోపు రోడ్లు మరమ్మతులు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ అధికారులు నిమజ్జనం కోసం వాహనాలు సిద్ధం చేయాలని.. టస్కర్ వాహనాలు, డ్రైవర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు తెలిపారు. ట్రాఫిక్ విషయంలో తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు తెలిపారు. రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు, జంక్షన్ల వద్ద మండపాలు ఏర్పాటు చేయొద్దని ఉత్సవ కమిటీలకు తెలుపాలన్నారు.

5 లక్షల మట్టి విగ్రహాల పంపిణీ..

ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లో విగ్రహాల నిమజ్జనానికి 22 ప్లాట్ ఫారంలు ఏర్పాటు చేయనున్నట్లు హెచ్‌ఎండీఏ కమిషనర్ వెల్లడించారు. ట్యాంక్ బండ్ పై 33 క్రేన్లు, జీహెచ్‌ఎంసీ పరిధిలో 100 స్టాటిస్టిక్ క్రేన్లు, 150 మొబైల్ క్రేన్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నిమజ్జనం జరిగే ప్రాంతంలో 10,500 మంది శానిటేషన్ సిబ్బంది, వ్యర్థాల తరలింపునకు 100 టిప్పర్స్ , 20 జేసీబీలు ఏర్పాటు చేయన్నుట్లు వివరించారు. ఈసారి జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ నుంచి 5 లక్షల మట్టి విగ్రహాలు పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఉత్సవాల సమయంలో అర్ధరాత్రి వరకు మెట్రో నడిపిస్తామని, నిమజ్జనం రోజు అర్ధరాత్రి 1 నుంచి 2 గంటల వరకు నడుస్తాయని మెట్రో అధికారులు పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ రైళ్లతో పాటు 650 వరకు బస్సులు నడుపనున్నట్లు అధికారులు వివరించారు. ఉత్సవాల కోసం 57 ట్రాన్స్‌ఫార్మర్లు, 22 మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, 3457 మంది విద్యుత్ సిబ్బంది పని చేయనున్నట్లు అధికారులు చెప్పారు. అంబులెన్స్‌లు, ప్రత్యేక వైద్య సిబ్బంది, ప్రాథమిక చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్ రెడ్డి, డీజీపీ జితేందర్, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, హైదరాబాద్, రాచకొండ కమిషనర్లు హైదరాబాద్ నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.